నవోదయ ప్రవేశ పరీక్షకు 261 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర), బాలికల పాఠశాలలో శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశానికి సంబంధించి 261 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు తెలిపారు. ఈ రెండు కేంద్రాల్లో 285 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ 24 మంది హాజరు కాలేదని ఆయన తెలిపారు. తెలుగు మీడియంకు సంబంధించి 210 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 191 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఇంగ్లీష్ మీడియం 74 మంది విద్యార్థులకు గాను 69 మంది విద్యార్థులు హాజరయ్యారు. హిందీ మీడియంలో ఒకరు హాజరైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిఎల్ఒలు కె.సూర్యనారాయణ, పి.వంశీధర్, సిఎస్‌లు బి.సుంబరా, కెపి నాగమణి, డిపార్ట్మెంటల్ అధికారి ఆనందరావు ఉన్నారు.

వేలాది మందిని తొలగించి 25 పని దినాలు పెంపు

జాతీయ ఉపాధి హామీకి లక్షల మంది పేదలను, వ్యవసాయ కార్మికులను దూరం చేసిన కేంద్ర ప్రభుత్వం ఏడాదికి అదనంగా 25రోజుల పని దినాలను పెంచుతున్నట్లు ప్రకటించడం, మరోవైపు ఉపాధి చట్టం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్పు చేయడం ఉపాధి కూలీలకు ఏమంత రుచించడం లేదు. వ్యాపారానికి వీరు అడుగుతున్న అదనంగా 100 పని దినాలు పెంచాలని, కనీసం రూ.600 వేతనం కల్పించాలని. పని ప్రదేశాల్లో నీరు, నీడ, గునపాలు, పారలు వంటివాటికి అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. జీవిక కాలంలో నిబంధనలు కఠినతరంతో కూలి కూడా సరిగా రావడం లేదు. వేలాది మంది జాబ్‌కార్డులను హోల్డ్‌లో పెట్టేసి పట్టుమని పాతిక పనిదినాలు పెంచడంవల్ల ఉపయోగమేమిటని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఉపాధి చట్టం పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజనగా మార్పు
- గాంధీ పేరు మార్పువెనుక ఆంతర్యమేమిటో?
- పనిదినాలు 200 రోజులకు పెంచాలంటున్న వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

2004లో అప్పటి యుపిఎ ప్రభుత్వం దేశంలో కమ్యూనిస్టుల భాగస్వామ్యంతో ఏర్పడిన సంగతి తెలిసిందే. వామపక్షాలతో కుదిరిన కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ఆహార భద్రతా చట్టం, అటవీహక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం తదితరాలతో సహా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఏర్పడింది. నేడు ఉపాధి వందరోజుల పనిదినాలు ప్రభుత్వం కల్పిస్తోందంటే అది అప్పట్లో వామపక్షాలు చూపిన చొరవే. ఇందులో భాగంగా ఏడాదిలో వందరోజులు పని దినాలు కల్పించడమే కాదు రెండు వారాల్లోపే కూలి చెల్లించాలి. అడిగిన వెంటనే పని కల్పించలేకపోతే నష్టపరిహారం చెల్లించే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇంకా పని ప్రదేశాల్లో నీరు, నీడ, ఇతర భద్రతా చర్యలు, ఇన్సూరెన్స్ వంటి అనేక సదుపాయాలు సమకూర్చారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఈచట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు అవకాశం లేకుండా అప్పట్లో చట్టబద్ధం చేశారు. నాటి నుంచి యుపిఎ-2 ప్రభుత్వం ఉన్నంత వరకు బాగానే సాగినప్పటికీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తోంది. ఇందులో భాగంగానే జాబ్‌కార్డులకు ఇకెవైసి, ముఖాధారిత హాజరు, రెండు పూటలా పని వంటి విధానాలను తీసుకొచ్చింది. మన్యం జిల్లాలో సుమారు 2లక్షల 7వేల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరందరికీ ఇకెవైసి చేయించాలనే మెలిక పెట్టడంతో వివిధ కారణాలతో అందుబాటులో లేని 6వేల మంది వేతన దారులకు ఈకెవైసి కాలేదు. వీరిలో మరణించిన వారు, సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లిన వారు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఇదేమంటే ఇది తొలగింపు కాదని, ఇకెవైసి నమోదు కాకపోవడం వల్ల హోల్డ్‌లో మాత్రమే పెట్టామని చెబుతున్నప్పటికీ, వారు వివిధ వలస ప్రాంతాల నుంచి వచ్చి అడిగిన వెంటనే పని కల్పించే పరిస్థితి ఉండే పరిస్థితి లేదు.

మరోవైపు ఈ చట్టం పేరులో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అనే పేరును పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన (పథకం)గా మార్పు చేస్తూ శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్‌లో నిర్ణయం చేశారు. గాంధీ పేరు ఉచ్ఛరించడం ఇష్టం లేని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ విధంగా మార్పుచేసిందన్న విమర్శలు మేధావి వర్గం, రాజకీయ నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. చిత్త శుద్ధి ఉంటే పనిదినాలు 25రోజులకు బదులు 100రోజులకు పెంచేలా డిమాండ్ చేయాలని కోరుతున్నారు.

పేరు మార్చడం జాతి పితను అవమానించడమే

దేశ స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని పక్కన పెట్టి బిజెపి ప్రతి విషయంలోనూ ఆర్ఎస్ఎస్ మూలాలను, మనువాద సిద్ధాంతాన్ని అనుసరిస్తోంది. అందులో భాగమే ఉపాధి చట్టం పేరు పూజ్య బాపు గ్రామీణ్ రోజ్‌గార్ యోజన (పథకం)గా మార్పు. వంద రోజులు పని దినాల లక్ష్యానికి ప్రతి ఏటా తూట్లు పొడుస్తున్నారు. రెండు పూటలా పని, ఫేస్ యాప్ పెట్టడం, ఉపాధి హామీ నుంచి కూలీలను దూరం చేసేందుకు కుట్ర ఇది. పని దినాలను 2వందల రోజులకు పెంచాలని డిమాండ్ చేస్తుంటే 25రోజులు మాత్రమే పెంచడం దుర్మార్గం. కూలీల రోజువారీ వేతనం 600 కావాలని డిమాండ్ చేస్తుంటే రూ.300 లోపే వేతనం వచ్చేలా నిబంధనలు విధిస్తూ తాజాగా రూ.240కు సవరించడం వ్యవసాయ కార్మికులను బిజెపి ప్రభుత్వం మోసం చేయడమే.

ఎం.శ్రీనివాసరావు,
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు

మోసపోయిన మొక్కజొన్న రైతులు

- రూ.2కోట్ల మేర టోపీ పెట్టిన వ్యాపారి
- 50మంది రైతులకు ఐపి నోటీసులు
- ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కష్టాలు : అన్నదాతలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో సాలూరు నియోజకవర్గ పరిధిలో వందలాది మంది మొక్కజొన్న రైతులు మోసపోయారు. రైతుల నుంచి మొక్కజొన్న గింజలు కొనుగోలు చేసిన ఓ వ్యాపారి కుచ్చుటోపీ పెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొన్నేళ్లుగా రైతులతో ఎంతో నమ్మకంగా వ్యవహరించిన వ్యాపారి పెద్ద ఎత్తున సాలూరు, పాచి పెంట మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు చేశారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తి ప్రాంతానికి చెందిన పులగం వీరవెంకట రెడ్డి అనే వ్యాపారి పట్టణంలోని రామా కాలనీలో నివసించేవారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న గింజలు కొనుగోలు చేయడం, రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించడం కొంతకాలం నమ్మకంగా నడిపించారు. ఈ ఏడాది కూడా అదేవిధంగా ఎక్కువ మొత్తంలో జొన్నలను కొనుగోలు చేశారు. గతంలో కొనుగోలు చేసిన పక్షం రోజుల్లో డబ్బులు చెల్లించిన వ్యాపారి ఈ ఏడాది నెలలు గడిచినా డబ్బులు రైతులకు ఇవ్వలేదు. అంతేకాకుండా డబ్బులు కోసం రైతులు ఫోన్ చేస్తుంటే సమాధానం ఇవ్వలేదు. దీంతో రైతులు ఆయన గురించి ఆరా తీయడం ప్రారంభించారు. రామాకాలనీ ఉన్న ఆయన ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉంది. ఆయన సొంత ఊరు కూడా వెళ్ళి ఆరా తీయగా అక్కడ కూడా ఇంటికి తాళం వేసి ఉండడాన్ని నిర్ధారించుకున్నారు. తమతో నమ్మకంగా వ్యవహరించిన వ్యాపారి వీరవెంకట రెడ్డి నట్టేట ముంచేశాడనే విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన రైతులు పోలీస్ స్టేషన్‌ల్లో ఫిర్యాదు చేశారు. సాలూరు రూరల్, పాచి పెంట పోలీసు స్టేషన్లలో రైతులు ఫిర్యాదు చేశారు. సాలూరు మండలంలోని పలు గ్రామాలకు చెందిన 16మంది రైతులు ఫిర్యాదు చేశారు. తాము విక్రయించిన మొక్కజొన్నలకు రూ.17లక్షల వరకు వ్యాపారి చెల్లించాలని, నెలలు గడుస్తున్నా ఇవ్వడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాచిపెంట మండలంలో కూడా పలు గ్రామాలకు చెందిన రైతులు 30మంది పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.27లక్షల 67వేలు చెల్లించాల్సి వుందని ఫిర్యాదు లో పేర్కొన్నారు.

వ్యాపారి తెలివి తేటలు, రైతుల అమాయకత్వం

లక్షలాది రూపాయలు బకాయిపడిన మొక్కజొన్న వ్యాపారి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా తెలివిగా బురిడీ కొట్టించారు. డబ్బుల కోసం పదే పదే ఫోన్ చేస్తున్న రైతులతో మాట్లాడుతూ మీ ఆధార్ కార్డులు పంపించాలని కోరారు. దీంతో 50మంది రైతులు వ్యాపారికి వాట్సాప్ మెసేజ్ ద్వారా ఆధార్ కార్డులను పంపించారు. తమ డబ్బులు పంపిస్తార ని గుడ్డిగా నమ్మిన రైతులు ఆధార్ కార్డులను పంపించారు. ఆధార్ కార్డుల్లో వున్న రైతుల అడ్రస్‌లకు వ్యాపారి తెలివిగా కోర్టు నుంచి ఐపి నోటీసులు పంపించడంతో రైతులు ఖంగుతిన్నారు. డబ్బులు పంపిస్తాడనే మైకంలో పడిపోయిన రైతులు ఆధార్ కార్డు అవసరం ఎందుకని ప్రశ్నించలేకపోయారు. వ్యాపారి నిజంగా డబ్బులు పంపించాలంటే ఫోన్ పే నెంబర్ లేదా బ్యాంక్ ఖాతా నెంబరు అడగాలి. అవి కాకుండా ఆధార్ కార్డులు పంపించాలని కోరి రైతుల్ని అవాక్కయ్యేలా చేశారు. సుమారు 50 మంది రైతులకు ఐపి నోటీసులు అందాయి. వారంతా రెండు రోజుల క్రితం బొబ్బిలి కోర్టుకు హాజరయ్యారు. ఆరోజు వ్యాపారి వీర వెంకట రెడ్డి గాని, ఆయన తరపు న్యాయవాది గాని హాజరు కాలేదు. దీంతో జడ్జి ఈనెల 29కి కేసు వాయిదా వేశారు. ఆరుగాలం శ్రమించి పండించిన మొక్కజొన్న పంటకు డబ్బులు రాకపోగా ఇప్పుడు కోర్టు చుట్టూ తిరగాల్సి పరిస్థితి ఏర్పడింది. ఐపి నోటీసులు అందుకున్న రైతులే కాకుండా ఇంకా చాలా రైతులు వ్యాపారికి మొక్కజొన్న గింజలు విక్రయించిన వారు ఫిర్యాదు చేయడానికి ముందుకు రాలేదు. రూ.37లక్షలు బకాయిలకు సంబంధించిన రైతులు మాత్రమే ఫిర్యాదు చేశారు. వీరికే వ్యాపారి నోటీసులు పంపించారు. సుమారు రెండు కోట్లకు పైగా వ్యాపారి మొక్కజొన్న గింజలు కొనుగోలు చేసి రైతులకు కుచ్చుటోపీ పెట్టారనే ప్రచారం జరుగుతోంది. ఒక్కో రైతుకు రూ.20వేల నుంచి రూ.4 లక్షల వరకు వ్యాపారి బకాయి వున్నట్లు తెలుస్తోంది.

జొన్నలను ఆరబెడుతున్న రైతులు

ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కష్టాలు

రాష్ట్ర ప్రభుత్వం ఏటా రైతులు పండించిన పంటలన్నింటినీ కొనుగోలు చేయడం లేదు. జిల్లాలో వరి తర్వాత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్న పంట మొక్కజొన్న. ఈ పంటను గత కొన్నేళ్లుగా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. నిల్వ చేసుకునే సామర్థ్యం లేక రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.2400 ఉన్నప్పటికీ, వ్యాపారులు రూ.1500 నుంచి రూ.1900 వరకు కొనుగోలు చేస్తున్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని గొప్పలు చెప్పుకొంటున్న పాలకులు ఆచరణలో మాత్రం రైతుల్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది.

ప్రభుత్వం కొనుగోలు చేసుంటే మాకీ పరిస్థితి వచ్చేది కాదు

వ్యాపారి పులగం వీరవెంకటరెడ్డికి 2.7లక్షల రూపాయల విలువైన మొక్కజొన్న గింజలు విక్రయించాను. నమ్మకంగా ఉండి ఆయన మోసం చేశారు. ప్రభుత్వం మొక్కజొన్న గింజలు కొనుగోలు చేసి ఉంటే రైతులకు ఈ పరిస్థితి వచ్చేది కాదు.

పల్లి ప్రసాద్, రైతు,
నెలిపర్తి, సాలూరు మండలం

వ్యాపారిని నమ్మి మోసపోయాం

వ్యాపారి పులగం వీర వెంకటరెడ్డి ఇంతలా మోసం చేస్తారని ఊహించలేదు. ఎప్పటిలాగే మొక్కజొన్న గింజలు విక్రయించిన తర్వాత డబ్బులు చెల్లిస్తారని భావించాం. నాకు కూడా రూ. రెండు లక్షల వరకు బాకీ వుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

బాలినేని హేమంత్, రైతు,
విశ్వనాథపురం, పాచి పెంట మండలం

ఆంపిలి వద్ద పాడైన కరకట్టు

ఇసుక అక్రమ రవాణాతో కరకట్లకు కష్టాలు

ప్రజాశక్తి - పాలకొండ

కరకట్లకు కష్టాలు తప్పడం లేదు. వరద ముంపు ప్రాంతాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి కరకట్లు నిర్మాణం చేపట్టారు. అయితే అంపిలి గ్రామం దగ్గరలో కరకట్లను పూర్తిగా నాశనం చేసి నాగావళి నుండి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ప్రతిరోజు రాత్రి 11 గంటల నుంచి వేకువజామున 4 గంటల వరకు ట్రాక్టర్లు, నాటుబండ్లతో ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. ట్రాక్టరుకు రూ.2వేలు వరకు వసూలు చేస్తుండగా నాటు బండికి రూ.400 వసూలు చేస్తున్నట్లు తెలుస్తుంది. వరద ముప్పు ప్రాంతాల్లో నిర్మించిన కరకట్లను పూర్తిగా పాడుచేసి ఇసుక రవాణా చేయడంతో అంపిలి గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాతరను ఘనంగా నిర్వహించాలి : మంత్రి

ప్రజాశక్తి - మక్కువ

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి శంబర పోలమాం జాతరను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ,శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాతర ఏర్పాట్లను పూర్తిచేయాలని సూచించారు. జనవరి 26,27,28 తేదీల్లో ప్రారంభం కానున్న శంబర జాతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి దేవాదాయ శాఖ అదికారులు, దేవాలయ కమిటీ, ఇతర శాఖల అధికారులతో మంత్రి శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శంబర పోలమాంబ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. గ్రామ పెద్దలు, అధికారులు సమన్వయంతో నెల రోజుల ముందుగా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. గతంలో చర్చించిన అంశాలపై వివిధ శాఖల అధికారులు తమ యాక్షన్ ప్లాన్‌తో సిద్ధంగా వచ్చి, పండగకు ఒక వారం ముందు మరో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలోని అధికారులు, అలాగే చుట్టుపక్కల 17 గ్రామాల ప్రజలు కలిసికట్టుగా సహకరించాలని కోరారు. దేవుడి మాన్యాల వద్ద రేకు షెడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. పండగ పూర్తైన వెంటనే అమ్మవారి గుడిని అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పటికే రూ.4కోట్లు దేవాలయ నిధులు తీసుకొచ్చామన్నారు. గతంలో ఇక్కడ రోడ్లు వేసుకోవడం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించుకోవడం ద్వారా వచ్చిన అవకాశాన్ని గుర్తు చేస్తూ, భవిష్యత్తులో అమ్మవారి వద్ద మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పోలమాంబ అమ్మవారిని కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో కలిసి మంత్రిదర్శించుకున్నారు.

కలెక్టరు మాట్లాడుతూ జాతర ప్రశాంతంగా, సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలీస్ బందోబస్తు తగినంత ఏర్పాటు చేసి, ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అలాగే బస్సు స్టేషన్లలో పారిశుధ్యంపై దృష్టి సారించి తాగునీటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం నియంత్రించాలన్నారు. సాలూరు నుండి మక్కువకు బస్సు సౌకర్యం లేకపోవడంపై మంత్రి ఆర్‌టిసి అధికారులను ప్రశ్నించగా రోడ్డు సౌకర్యం లేక బస్సు నడపలేకపోతున్నామన్నారు. రోడ్డు నిర్వహణకు సంబంధించి ఆర్ అండ్ బి జెఇ రానున్న 2వారాల్లో రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు.

800 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టామని సాలూరు రూరల్ సిఐ రామకృష్ణ వివరించారు. 145మంది పారిశుధ్య కార్మికులు ఏర్పాటు చేసి నిరంతరం పారిశుధ్యం అందజేస్తామని డిపిఒ కొండలరావు వివరించారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ 250 మంది పారిశుధ్య కార్మికులను నియమించి, వారికి వసతి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జాతర సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఎపిఇపిడిసిఎల్ డిఇ విద్యుత్ ఏర్పాట్ల పై మాట్లాడుతూ 40 మంది సిబ్బందితో షిఫ్ట్ వారీగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఇఇ మాట్లాడుతూ నిరంతరం తాగు నీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. గ్రామంలో వివిధ ప్రదేశాల్లో 50 మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని చెప్పగా, అదనంగా మరికొన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ అధికారి మాట్లాడుతూ పండగ మూడు రోజులు 24 గంటలు టెంపరరీ చెక్ పోస్టు ఏర్పాటు చేస్తామన్నారు. రెండు మొబైల్ టీమ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మక్కువ తహశీల్దార్, ఎంపిడిఒ పండగ సమయంలో చేపట్టనున్న పనులు వివరించారు. పండగ రోజుల్లో దుకాణాల మంజూరుకు టెండర్లు పిలవాలన్నారు. గ్రామంలో చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. సొంత నిర్ణయాలు తీసుకోకుండా సబ్ కలెక్టర్ దృష్టిలో ఉంచి అనుమతి తీసుకోవాలన్నారు. జాతరకు దేవాదాయ శాఖ చేపట్టనున్న పనులు వివరించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ 8 మెడికల్ క్యాంపులతో పాటు 108, 104, ఫ్రీడమ్ అంబులెన్సులు అందుబాటులో ఉంచుతామన్నారు. మంత్రి స్పందిస్తూ సుమారు 10 వారాలు పండగ జరుగుతుందని, కావున మెడికల్ క్యాంపులు మరిన్ని రోజులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి మనీషారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ అధికారి రాజారావు, జిల్లా విపత్తుల నివారణ అధికారి పి.సింహాచలం, జిల్లా రవాణాశాఖ అధికారి టి.దుర్గాప్రసాద్ రెడ్డి, జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్య ఆరోగ్య, సంబంధిత శాఖ అధికారులు, మక్కువ ఎంపిడిఒ ఎన్.అర్జున్ రావు, తహశీల్దార్ కె.భరత్ కుమార్, దేవాలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నైదాన తిరుపతి రావు, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, సర్పంచ్ ఎ.సింహాచలం, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, వసంతల భాస్కరరావు, గంజి కాశీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కురుపాం

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, స్కూల్ సిప్పర్లతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు సిఐటియు అఖిలభారత మహాసభలు తొలిసారిగా ఉత్తరాంధ్రలో, ఆంధ్ర రాష్ట్రంలో విశాఖపట్నంలో నిర్వహించబడుతున్నాయని, దేశవ్యాప్తంగా కార్మికులు, నాయకులతో పాటు అంతర్జాతీయ కార్మిక నాయకులు కూడా ఈ మహాసభలకు హాజరవుతారని, కార్మిక వ్యతిరేక విధానాలపై విస్తృత చర్చలు జరిపి, భవిష్యత్ ఉద్యమాలకు దశా-దిశలు రూపొందించనున్నారని, కావున ప్రతి కార్మికుడు, ప్రజాసంఘాల ప్రతినిధులు మహాసభల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, యూనియన్ నాయకులు గౌరమ్మ, తోయక పార్వతి, కమల, కళావతి, సుహాసిని, శ్రీదేవి, సుగుణ, తులసి, దమయంతి, చామంతి తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాలను విడుదల చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, స్కూల్ స్వీపర్లు

కొమరాడ : సిఐటియు 18 భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శ్రీ మజ్జి గౌరీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గోడ పత్రికలను కొమరాడలో విడుదల చేశారు. అనంతరం సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ఆటో యూనియన్ నాయకులు గోపి మాట్లాడుతూ విశాఖపట్నంలో జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేసేలా మండలంలోని ఆటో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 9513 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి- పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 9513 కేసులు పరిష్కారమైనట్లు ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.బబిత తెలిపారు. జిల్లా కోర్టులో జరిగిన అదాలత్‌లో ఆమె మాట్లాడుతూ ఈ అదాలత్ వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుందని అన్నారు. పరిష్కారమైన కేసుల్లో సివిల్ కేసులు 424, క్రిమినల్ కేసులు 9028, ప్రీ లిటిగేషన్ కేసులు 61 ఉన్నాయన్నారు. ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 90 లక్షల రూపాయలు మోటార్ ప్రమాద బీమా కేసులో పిటిషనర్ కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా అందజేశారు. విజయనగరంలో 3612, పార్వతీపురం లో 702, బొబ్బిలిలో 1197, సాలూరులో 1453, శృంగవరపు కోటలో 1001, గజపతినగరంలో 1052, చీపురుపల్లిలో 128, కొత్తవలసలో 236, కురుపాం 132, కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు మీనాదేవి, అప్పలస్వామి, పద్మావతి, నాగమణి, ఎ.కృష్ణప్రసాద్, పలుశాఖల అధికారులు, ఇన్సూరెన్సు అధికారులు పాల్గొన్నారు.

కురుపాంలో జరిగిన అదాలత్‌లో పాల్గొన్న జడ్జి సౌమ్యం జోస్పిన్

కురుపాం : జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో కురుపాం కోర్టుకు సంబంధించి 132 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి సౌమ్యజోస్పిన్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టుకు సంబంధించిన కేసులు పార్వతీపురం కోర్టులో పరిష్కరించారు. వీటిలో 7 ఐపిసి కేసులు, 63 ఎక్సైజ్ కేసులు, 62 ఎన్టీసీ కేసులు పరిష్కారం కాగా, అపరాధ రుసుం కింద రూ.46 వేలు వసూలైనట్లు న్యాయమూర్తి తెలిపారు. మెగా లోక్‌అదాలత్ సభ్యులు న్యాయవాది బరాటం చంద్రమౌళి, ఎస్ఒ గొరారి వెంకటరావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చంద్రకుమార్, అధిక సంఖ్యలో కక్షిదారులు, పోలీసులు, మండల లీగల్ సర్వీసెస్ సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండగ ముంగిట వలసలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంకా సంక్రాంతి పండగక్కి నెలరోజులే గడువు ఉంది. క్రిస్మస్ హడావుడి ఇప్పటికే ప్రారంభమైంది. సాధారణంగా జిల్లా నుంచి వలసపోయేవారు తిరుగు ప్రయాణానికి సిద్ధమౌతారు. కానీ, పార్వతీపురం మన్యం జిల్లాలో ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. పండగ దగ్గరపడినప్పటికీ వలసపోతుండడం నిజంగా మన్య జిల్లా దౌర్భాగ్య దుస్థితికి తార్కాణమే. వాస్తవానికి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజానీకం నిత్యం వలసలు పోతుంటారు. కానీ, ఖరీఫ్ పంటలు చేతికి అందేసమయం (వనంబర్, డిసెంబర్ నెలలు)లో సగానికి సగం వలస కుటుంబాలు సొంతగూటికి చేరుకుంటాయి. మిగిలిన వారు క్రిస్మస్, సంక్రాంతి పండగలకు వస్తుంటారు. వరి కోతలు, నూర్పులు పూర్తికావడం, గిరిజన ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, 100రోజుల ఉపాధి పనులు కూడా పూర్తికావడంతో ఎలా బతకాలో అర్థం కాని ప్రజానీకం వలసపోతున్నారు. ఏటా ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం కోత విధిస్తున్న సంగతి విధితమే. ఈనేపథ్యంలోనే ఇకెవైసి నమోదు పేరిట అందుబాటులో లేనివారి ఉపాధి కార్డులను కూడా హోల్డ్‌లో పెట్టేశారు. దీంతో, వీరి తరపున కుటుంబంలో వేరొకరు పనిచేసుకునే వెసులు బాటు కోల్పోయారు. ఇది కూడా సమయం కాని సమయంలో వలసలు కనిపించడానికి మరో కారణమని పలువురి నోట వినిపిస్తున్నమాట. గుమ్మలక్ష్మీపురం మండలంలోని లోవ ముఠా ప్రాంతంలో తమకు ఉపాధి పనులు కల్పించడంలేదంటూ అనేక గ్రామాల ప్రజానీకం చెప్తున్నారు. నూర్పు యంత్రాలు వచ్చిన తర్వాత వరి కోతలు 10, 15 రోజుల్లోనే పూర్తయ్యాయని, పనులు లేకపోవడంతో గిరిజనులు వలసలు వెళ్లిపోక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు గత రెండునెలలుగా చేసిన పనులకు బిల్లు చెల్లించలేదనే వాదన కూడా ఉంది. బకాయిలు చెల్లించాలంటూ ఇటీవల ఏకంగా ధర్నాలు చేపట్టినా ప్రభుత్వం నుంచిగానీ, అధికార యంత్రాంగం నుంచిగానీ స్పందన లేదు. ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయాలన్న కేంద్ర ప్రభుత్వం కుట్ర జనాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టింది. పరోక్షంగా వలసలకు కారణమౌతోంది. ఇప్పటికే జాబ్ కార్డులు రద్దు చేశారని, ఉపాధిహామీని ఎత్తి వేయడానికి కూలీలు విసిగిపోయేలా ఈ చట్టాన్ని పూర్తిగా లేకుండా చేయడానికి చూస్తుందని పలువురు విమర్శిస్తున్నారు. ఇందుకు తగ్గట్టే రెండు పూటల పని విధానం, ఫేస్ యాప్, మేట్లుకు ప్రోత్సాహం ఇవ్వకపోవడం, పారలు, తట్టలు, గుణపాలకు మెయింటెనెన్స్ ఖర్చులు, టెంట్లు మెడికల్ కిట్లు ఇవ్వకపోవడం వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది. మొత్తానికి పేదలు, గిరిజనులు, వ్యవసాయ కార్మికులు పండగ ముగింట పుట్టెడు దుఖంతో ఊరుదాడి వలసపోతున్నారు. ప్రభుత్వ తీరుపై వారినోట శాపనార్థాలు వినిపిస్తున్నాయి.

పిల్లలకు టీకాలు వేయిస్తున్న డిఆర్‌ఓ హేమలత

నిర్ణీత గడువులోగా టీకాలు తప్పని సరి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

సామాన్యులతో పాటు ఉన్నతాధికారులు సైతం తమ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వ్యాధినిరోధక టీకాలను వేయించడంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చడం సంతోషకరమని, ప్రజలకు ఎంతో ప్రేరణగా నిలుస్తుందనిరాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ టి. జగన్‌మోహనరావు అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శనివారం టీకా కార్యక్రమంలో భాగంగా నిర్ణీత గడువు తేదీ సమీపించిన నేపథ్యంలో డిఆర్ఓ కె.హేమలత తమ పిల్లలకు వైద్య సిబ్బందిచే వ్యాధినిరోధక టీకాలు వేయించారు. టీకా వివరాలను సిబ్బంది ఆన్‌లైన్ నమోదు చేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాలు నిర్ణీత సమయానికి తమ పిల్లలకు మొదటి నుంచి వేయించడం జరుగుతుందన్నారు. వైద్యారోగ్యశాఖ టీకా నిర్వహణ కోల్డ్ చైన్ సిస్టమ్ సమర్థవంతంగా ఉంటుందని, టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ ఉంటుందని, నిర్ణీత గడువులో టీకాలు వేయించాలని సూచించారు. డాక్టర్ టి.జగన్‌మోహన్ మాట్లాడుతూ వృత్తి రీత్యా నిత్యం ఎంతో బిజీ ఉన్నపటికీ జిల్లాలో పలువురు ఉన్నతాధికారులు ఇప్పటికే తమ పిల్లలకు టీకా కార్యక్రమం ద్వారా నిర్ణీత సమయానికి టీకాలు వేయించామని, సకాలంలో టీకాల ఆవశ్యకతను తెలియజేయడంలో ఇది ఎంతగానో దోహదం పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు బి.పుష్ప, ఎఎన్ఎం జె.సునీత తదితరులు ఉన్నారు.

ఉద్యోగోన్నతులపై హర్షం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న భాషా పండితులకు ఉద్యోగ పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ ఆమోదం తెలపడంపై గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా సురేష్ వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. పార్వతీపురం ఐటిడిఏ పరిధిలో ఉపాధ్యాయులు , బోధనేతర సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని అధికారులకు గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్లా సురేష్ ఒక ప్రకటనలో కోరారు.

16న మండల సమావేశం

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 16న మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిబి మిశ్రా తెలిపారు. ఎంపిపి అధ్యక్షతన స్థానిక ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయంలో జరగనున్న సమావేశానికి కావున అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మహేశ్వరరావు

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లిలో ఎస్‌సి కాలనీలోని పేదలకు గుంట్రెడ్డి శ్రీనివాసరావు అందజేసిన దుప్పట్లను సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు, బోను కుమారి చేతుల మీదుగా శనివారం అందజేశారు. దళిత కాలనీలో దాదాపు 110 కుటుంబాలకు దుప్పట్లు అందజేసిన దాత గుంట్రెడ్డి శ్రీనివాసరావును సర్పంచ్ అభినందించారు. అనంతరం జరిగిన సమావేశంలో సర్పంచ్ మహేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని కోరారు. దాతల సహకారంతో గ్రామంలో పెద్ద ఎత్తున సామాజిక, సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో బోను కుమారి, జి.దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణమ్మ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కడకెల్లకు చెందిన మర్రాపు నారాయణమ్మ కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. ఆమె మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయనతో పాటు ఎంపిపి ధమలపాటి వెంకటరమణ నాయుడు, కర్రి లీలా ప్రసాదు, శంకర్ జయదేవ్, పాలవలస ధవళేశ్వరరావు, గుంట్రెడ్డి గౌరీ శంకర్, నారాయణమ్మ కుమారుడు ఉమామహేశ్వరరావు తదితరులు ఉన్నారు.

153 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - సీతానగరం

అక్రమ మద్యం అమ్మకాలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేసి అటువంటి 153 కేసులు పరిష్కారమైనట్లు సీతానగరం ప్రొహిబిషనల్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అకాలత్ ద్వారా సీతానగరం, బలిజిపేట, గరుగుబిల్లి మండలాల్లో గతంలో నమోదు చేసిన కేసులన్నీ పరిష్కరించబడ్డాయన్నారు. అందులో బొబ్బిలి కోర్టులో 123, పార్వతీపురం కోర్టులో 30 కేసులు పరిష్కరించబడ్డాయని ఆమె తెలిపారు.

ఈ సంక్రాంతికైనా వెంకంపేట రోడ్ వేస్తారా?

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మండలంలోని వెంకంపేట రహదారి రోడ్డును ఈ సంక్రాంతికైనా వేస్తారా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ నాయకులు వంగలి దాలి నాయుడు, సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, చొక్కాపు వెంకటరమణ, కోల కిరణ్ కుమార్, తీళ్ల గౌరీశంకరరావు తదితరులు వెంకంపేట గోరీలు మొదలుకొని వెంకంపేట నుంచి ఎమ్మార్ నగరం రోడ్డు వరకూ ఏర్పడిన పెద్దపెద్ద గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఈ రహదారిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడి ప్రయాణికులు ప్రమాదాల మారినపడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న కనీస స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్రాంతికి గోతులు పడిన రోడ్లన్నింటికీ కొత్త రోడ్లు వేయిస్తామని పాలకులు, అధికారులు ప్రకటనలు గుప్పించారని, కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఒక సంక్రాంతి పోయి, రెండో సంక్రాంతి వస్తున్నప్పటికీ రోడ్లలో గోతుల మాత్రం పోలేదని ఎద్దేవా చేశారు. వైసిపి హయాంలో రోడ్లు గోతులమయమైనప్పటికీ పట్టించుకోలేదని, దీంతో ప్రజలు గత ఎన్నికల్లో ఇంటికి పంపించారన్న విషయాన్ని ప్రస్తుత పాలకులు మర్చిపోరాదన్నారు. ఇదే పరిస్థితి పునరావృతం కాకూడదని, తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి గోతులమయమైన రోడ్లలో కొత్త రోడ్లు వేయించాలని డిమాండ్ చేశారు.

పాడైన వెంకంపేట రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అంగన్వాడీలకు మొబైల్ ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో 2,169 మొబైల్ ఫోన్లను సిబ్బందికి అందించినట్లు రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ముస్తాబు కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ముఖ్యంగా అంగన్వాడీ కేంద్రాల నిర్వహణలో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడానికి దోహదపడుతుందని అన్నారు. శనివారం వన్ స్టాప్ కేంద్రం ఆవరణలో మంత్రితో కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ టి.కనకదుర్గ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని 2,075 అంగన్వాడీ కేంద్రాలకు ఒక్కొక్కటి చొప్పున మొబైల్ ఫోన్లు కేటాయించామన్నారు. వీటితో పాటు, పర్యవేక్షణాధికారులైన 84 మంది సెక్టార్ సూపర్ వైజర్లకు, అలాగే పరిపాలనా వ్యవహారాలను చూసే 10 మంది బ్లాక్ కోఆర్డినేటర్లకు ఈ మొబైల్ ఫోన్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ మొబైల్ ఫోన్ల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు సంపూర్ణ పోషణ, పిల్లల హాజరు, పోషకాహార పంపిణీ వంటి కీలకమైన రియల్‌టైం సమాచారాన్ని ఆన్‌లైన్ యాప్‌లలో తక్షణమే నమోదు చేయగలుగుతారని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెరిగి, సేవలు మరింత వేగంగా ప్రజలకు చేరువవుతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రవేశపెట్టిన ముస్తాబు కార్యక్రమం రాష్ట్రంలోని 26 జిల్లాల ఐసిడిఎస్‌లో ఏర్పాటు చేశామన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కేవలం భోజనం, గుడ్డు వంటి ఉచిత సదుపాయాలు అందిస్తే సరిపోదని, పిల్లలు, టీచర్ల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. 'హ్యాపీ డే' కార్యక్రమంతో కొత్త ఉత్సాహం, పిల్లల్లో ఆనందం పెంచడానికి, ఉపాధ్యాయులు -పిల్లల మధ్య దూరం తగ్గించడానికి ప్రతి శనివారం 'హ్యాపీ డే' కార్యక్రమాన్ని తప్పనిసరి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్లు కలిసి డాన్స్ వేయడం ద్వారా

అంగన్‌వాడీ సిబ్బందికి మొబైల్ ఫోన్‌ను అందజేస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్

పిల్లలు టీచర్లను స్నేహితులుగా భావించే ఒక సానుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. పిల్లలు ఉదయాన్నే లేచి పరుగెత్తుకుంటూ వచ్చి, అంగన్వాడీ సెంటర్ ఎప్పుడు తాళం తీస్తారని ఎదురుచూడాలని, అది మీ అందరి లక్ష్యమని సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ మార్పుల ద్వారా అంగన్వాడీ కేంద్రాలు పిల్లలకు అత్యంత ప్రీతిపాత్రమైన ప్రదేశంగా మారుతాయని ఆశిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ, కురుపాం ఎమ్మెల్యే తోయిక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు టెక్నికల్ వైపు తీసుకువెళ్లాలని, భవిష్యత్‌లో మరిన్ని మంచి సేవలు అందజేయాలన్నారు. అనంతరం బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ అని కార్యక్రమానికి హాజరైన వారితో మంత్రి సంధ్యారాణి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, బాబు, పెంటా సత్యం నాయుడు, రవి, పైల నాగభూషణరావు, గొట్టపు వెంకటరమణ, వెంకట నాయుడు, కురుపాం సిడిపిఒ విజయగౌరి, అంగన్వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, ఐసిడిఎస్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మురుగు కదలదు.. వాడుక నీరువెళ్లదు

పూడిక తీత పనులు చేపట్టని కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కాలువలో పేరుకుపోయిన మురుగు

పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న కాలువల్లో పూడికతీతలు తీయక పోవడంతో, కూడికలు పేరుకుపోయి వాడుకనీరు వెళ్లేందుకు అవకాశం లేక తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారింది. వార్డుల్లో పూడిక తీత పనులు చేపట్టేందుకు 1 నుంచి 15 వార్డులు ఒక కాంట్రాక్టర్‌కు, 15 నుండి 30 వార్డు ఒక కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. అయితే 15 నుంచి 30 వార్డుల్లో ఉన్న కాలువల్లో పూడికతీత పనులు సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టకపోవడంతో పాటు, ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లోనూ పూడికతీత పనులను కాంట్రాక్టర్ చేపట్టడంలేదు. దీంతో ఆయా కాలువల్లో పూడికలు పేరుకు పోయాయి. దీంతో ప్రధాని రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలతో పాటు, ఆయా వార్డుల్లో కాలువల్లో మురుగునీరు ప్రవహించకపోవడంతో ఆయా వార్డుల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ఆయా వార్డుల్లో పూడికతీతకు రీ టెండర్ పిలిచి పనులు చేపట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా వార్డుల ప్రజలు కోరుతున్నారు.

పిల్లలచే మొక్కలు నాటిస్తున్న హెచ్ఎం

పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - సీతానగరం

పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యతని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె,కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బొక్కుపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణం కాలుష్యాన్ని నివారించాలన్నారు. ప్రతి విద్యార్థి తన జీవితంలో జరిగే శుభదినానికి గుర్తుగా మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయి ప్రసాద్, తిరుమలదేవి దంపతులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

విశ్రాంతి అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంథా సాయి ప్రసాద్, తిరుమల దేవి దంపతులకు స్థానిక ఆర్యవైశ్య భవనంలో శనివారం ఘన సన్మానం జరిగింది. షష్టబ్ది పూర్తి చేసుకున్న సందర్భంగా కీర్తిశేషులు రెడ్డి శ్రీరామ్మూర్తి ప్రాంగణంగా నామకరణంలో ప్రముఖ కవి పక్కి రవీంద్ర అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. ప్రాంగణంలో ఐసిఇయు నాయకులు, ప్రముఖ వ్యక్తులతో జరిగిన ఉద్యమ కార్యక్రమాల ఫోటో ప్రదర్శన సాయి ప్రసాద్ యొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పింది. సాయి ప్రసాద్ దంపతులు సన్మానంలో సాధారణంగా సన్మాన కార్యక్రమాలు యజ్ఞ యాగాలు, పొగడ్తలతో జరుగుతాయి. అందుకు భిన్నంగా సాయి ప్రసాద్ దంపతుల షష్టబ్ది పూర్తి కార్యక్రమంలో అమ్మ నాగరత్నం, అత్త అమ్మాజీ, అక్షరాభ్యాసం చేసిన మొదటి గురువు బెహరా శేఖర్, అనంతరం గురువులు అగ్నిహోత్రులు తదితర ఉపాధ్యాయులను దుశ్శాలువాతో సన్మానించారు. అంతేకాకుండా ఎల్ఐసిలో విశేషంగా కృషి చేసిన చేసిన చీఫ్ మేనేజర్ శేషాచర్, కొంతమంది ఉద్యోగులను సాయి ప్రసాద్ దంపతులు దుశ్శాలువాతో సన్మానించి సత్కరించారు. పార్వతీపురంలో నిరాసితులైన పిల్లలను అక్కున చేర్చుకుని వారికి అమ్మగా బాధ్యతలతో ఎంతోమంది పిల్లలకు భవిష్యత్తునిస్తున్న జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజను, ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి, మెమొంటోళ్లను అందజేసి వారిని ప్రోత్సహించారు. అనంతరం సాయి ప్రసాద్ దంపతులకు కుటుంబ సభ్యులు, ఎల్ఐసి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జిల్లా కమిటీ సభ్యులు దుశ్శాలువతో సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భముగా వక్తలు మాట్లాడుతూ సాయి ప్రసాద్ పార్వతీపురం ఎల్ఐసి బ్రాంచ్ అభివృద్ధికి ఎనిలేని కృషి చేయడమే కాకుండా ట్రేడ్ యూనియన్ భావజాలంతో ప్రజల సంబంధాలతో కూడుకున్న విధులు నిర్వహించి,

సాయిప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

ఆదర్శవంతంగా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం భవిష్యత్తు ఉద్యోగులకు మార్గదర్శకులుగా నిలబడ్డారన్నారు. ఎల్ఐసి ఏజెంట్లు సాయి ప్రసాద్‌ను భుజానేసుకుని ఎల్ఐసి ఏజెంట్లు యూనియన్ జిందాబాద్ అంటూ ఒక్కసారిగా నినాదాలు చేశారు. అందరు మన్ననలు పొందడం గొప్ప విశేషంగా కొనియాడారు. సన్మాన గ్రహీత సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఎల్ఐసి పేద ప్రజలకు ఒక అండగా ఉందని, దీన్ని ప్రైవేటుపరం కాకుండా ట్రేడ్ యూనియన్ సిఐటియు అనుబంధంతో ఐసిఇయు, ఎఐఐఇయు, తదితర సంఘాల ఉద్యమంతో ఎల్ఐసిని కాపాడుకోగలుగుతున్నామన్నారు. ఈ ప్రాంతంలో అందరి సహకారంతో ఉద్యోగ విధులను సక్రమంగా నిర్వహించడమే కాకుండా సామాజిక కార్యక్రమాలకు అండగా నిలబడ్డారని అందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - సాలూరు

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై బోధనేతర కార్యక్రమాలు, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. శనివారం స్థానిక పెన్షనర్ల హోంలో సాలూరు, పాచిపెంట మండలాల యుటిఎఫ్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై ప్రభుత్వం విధించే అదనపు భారాన్ని తగ్గించాలని, సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ పరిధి నుంచి మినహాయించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులపై ఉన్న బోధనేతర కార్యక్రమాల భారాన్ని తగ్గించాలని, విద్యాశాఖ అత్యవసర శాఖ కాదని, కాబట్టి ఉపాధ్యాయులపై విధిస్తున్న అనవసరమైన యాప్‌ల భారాన్ని తగ్గించాలనీ, అసంబద్ధ నిర్ణయాలతో బోధనా కార్యక్రమాలకు దూరం చేయవద్దని కోరారు. అనంతరం సాలూరు, పాచిపెంట మండలాలకు నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సాలూరు మండల గౌరవాధ్యక్షులు ఎస్.సింహాచలం, అధ్యక్షులుగా ఎ.సీతయ్య, ప్రధాన కార్యదర్శిగా అనకాపల్లి గణేష్, సహాధ్యక్షులు ఎస్.కృష్ణ, ఆర్. రజని, కోశాధికారికిగా యు.తిరుపతి ఎన్నికయ్యారు. అలాగే పాచిపెంట మండల గౌరవ అధ్యక్షులుగా

నూతన కార్యవర్గంచే ప్రమాణం చేయిస్తున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కరరావు

బి.మధుసూదనరావు, అధ్యక్షులుగా సిహెచ్. భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.గణపతి, సహాధ్యక్షులు ఎస్.అశోక్, జి.స్వాతి, కోశాధికారిగా ఎన్.సురేష్ కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు బి.విజయ్ కుమార్, జిల్లా కార్యదర్శులు కె.జానకీరావు, బి.రామకృష్ణ, ఐ.రాజమణి, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మతిస్థిమితం లేని కారణంగా తన పెద్దమ్మ రౌతు గౌరమ్మ 20 రోజులుగా కనిపించడం లేదని కుమారుడు శ్రీరాములు తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలో బతుకుతెరువు కోసం వచ్చి ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నడుపుతున్నామని, తన పెద్దమ్మను కొమరాడ మండలం తోడుములో ఉంచగా 20 రోజులు నుంచి కనిపించడం లేదని అన్నారు. ఫోటోలో ఉన్న వ్యక్తిని ఎవరైనా గుర్తించినట్లయితే 949075 226, 9 3 9 8 2 3 8 8903 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

వైసిపి సోషల్ మీడియా స్టేట్ జాయింట్ సెక్రటరీగా అశోక్ తేజ

ప్రజాశక్తి - సాలూరు

వైసిపి సోషల్ మీడియా స్టేట్ జాయింట్ సెక్రటరీగా ఒంటి అశోక్ తేజని నియమించారు. ఉన్నత విద్యావంతుడైన అశోక్‌తేజ గత కొంతకాలంగా నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా బాధ్యతలు నిర్వహించేవారు. ఆయన సేవను గుర్తించిన వైసిపి నాయకత్వం స్టేట్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.శనివారం అశోక్ తేజని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర వైసిపి నాయకులు అభినందించారు.

వాహనాలు తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక హనుమాన్ జంక్షన్‌లో ఎస్ఐ ఎం.రాజేష్ శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గతంలో పెండింగ్ ఉన్న కేసులు అపరాధ రుసం చెల్లించి కేసులు క్లియర్ చేసుకోవాలన్నారు. వాహనాల పత్రాలను వాహనదారుల నుంచి పరిశీలించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

నిరాశ్రయులకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

గజగజ వనికిస్తున్న చలి నుండి నిరాశ్రయులను కాపాడేందుకు రగ్గులను, మంకీ క్యాప్ లను అందజేయడం జరిగిందని జనవిజ్ఞాన వేదిక జిల్లా కోశాధికారి షిణగం శివాజీ తెలిపారు. కొల్లి గణేష్,వాసాల సాయిరామ్ ఆర్థిక సహకారంతో శుక్రవారం రాత్రి నగరంలో నిరాశ్రయులకు రగ్గులు అందజేశారు. కార్యక్రమంలో వాసాల సాయిరాం, కాళ్ళ రామారావు, పవన్ పాల్గొన్నారు.

జనసేన అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర నాగవంశం వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జర్జాపు దిలీప్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక జనసేన కార్యాలయంలో డైరెక్టర్ జర్జాపు దిలీప్ కుమార్‌ను పలువురు జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభినందించారు. పార్టీ జిల్లా నాయకులు అవనాపు విక్రమ్‌తో సహా మున్సిపల్ మాజీ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, కౌన్సిలర్లు దిలీప్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ జిల్లా నాయకులు అవనాపు విక్రమ్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి సిఫార్సు మేరకు తనను రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ నియమించారని చెప్పారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా నియోజకవర్గంలో పార్టీ విస్తరణకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కీలకపాత్ర పోషించే దిశగా ప్రయత్నిస్తానని చెప్పారు.

త్వరలో జనసేన సంస్థాగత కమిటీలు : అవనాపు విక్రమ్

జనసేన సంస్థాగత కమిటీల నియామకం త్వరలో జరగనుందని జిల్లా నాయకులు అవనాపు విక్రమ్ చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వారికి రానున్న సంస్థాగత కమిటీల్లో ప్రాధాన్యత వుంటుందని చెప్పారు. మన్యం జిల్లాలో పార్టీ అభివృద్ధికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు.

నాగవంశం వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జర్జాపు దిలీప్ కుమార్

భంజ్‌దేవ్‌ను కలిసిన దిలీప్

టిడిపి ముఖ్యనేతలతో భేటీ

నాగవంశం వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జర్జాపు దిలీప్ కుమార్‌తో సహా జిల్లా నాయకులు అవనాపు విక్రమ్ శనివారం సాయంత్రం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్‌ను కలిశారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన జర్జాపు దిలీప్ కుమార్‌ను వారు అభినందించారు. జనసేన సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు కూడా వారి వెంట ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఎముకలు బలంగా ఉండాలంటే.. శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవాలని ప్రముఖ వైద్యులు, ఎముకల కీళ్ల వ్యాధుల నిపుణులు డాక్టర్ జివిఎన్ భూపతి పేర్కొన్నారు .ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ ఆధ్వర్యంలో కాళీ ఘాట్ కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. వాకింగ్, జాగింగ్, స్విమ్మింగ్, రన్నింగ్, మెట్లు ఎక్కడం లాంటివి ఎముకలు బలంగా ఉండేందుకు దోహదపడతాయని, ఈ వ్యాయామాలు ఎముకల కణాల పెరుగుదలకు సహాయపడతాయని అన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని 42 వ డివిజన్ కార్పొరేటర్ పిన్నింటి కళావతి, సూర్యనారాయణ దంపతులు ప్రారంభించారు . శ్రీ హాస్పిటల్ అధినేత డాక్టర్ భూపతి నేతృత్వంలో సన్ షైన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జరిగిన వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించడమే కాక ,ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు .ఈ వైద్య శిబిరాన్ని సుమారు 300 మంది వినియోగించుకున్నారు కార్యక్రమంలో కరస్పాండెంట్లు టి. సంధ్య,టి.జ్యోతి, పి.నీలిమ, ఆసుపత్రి సిబ్బంది, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు నూకల సుధీర్ ,రఘుమండ రామకృష్ణ, డి.భాస్కర్ రావు, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

నాహి కలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది కస్పా హైస్కూలు విద్యార్థినులు శనివారం విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. సిఐ ఈ.నర్సింహమూర్తి విద్యార్థినులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మంచి భవిష్యత్తును నిర్ణయించేది చదువేనన్న విషయాన్ని విద్యార్థులు ముందుగా గుర్తించాలన్నారు. ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. తెలిసీ తెలియని వయస్సు లో ప్రలోభాలకు లొంగడం, ఆకర్షణలకు లోనుకావడం, సోషల్ మీడియాకు అలవాటు పడడం వలన భవిష్యత్తు నాశనం అవుతుందన్నారు.

విద్యార్థినులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి వుండాలని, తల్లితండ్రులు, తోబుట్టువులను తప్ప వేరే వాళ్ళను నమ్మి వారి మాయ మాటలకు మోసపోకూడదన్నారు. కార్యక్రమంలో మహిళా పిఎస్ ఎస్ఐ శిరీష, సిబ్బంది. శక్తి టీమ్స్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా వెంకటేష్ పుట్టిరోజులు వేడుకలు

ప్రజాశక్తి - పాలకొండ


పేదలకు అన్నదానం చేస్తున్న వెంకటేష్ అభిమానులు

సినీ నటుడు వెంకటేష్ 66వ పుట్టినరోజు వేడుకలు పాలకొండ పట్టణ ఆయన అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. తమ అభిమాన హీరోకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు అందించాలని కోటదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా అన్నా క్యాంటీన్ వద్ద మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు. సుమరుగా 300 మందికి మధ్యాహ్నం భోజనం అందించారు. ఈ సందర్భంగా విక్టరీ వెంకటేష్ అభిమాని కోటపాటి నరసింహ మాట్లాడుతూ విక్టరీని తన ఇంటిపేరుగా మార్చుకున్న ఏకైక హీరో వెంకటేష్ బాబు అని మూవీ మొఘల్ రామానాయుడు వారసుడిగా తెరంగ్రేటం చేసి ఎందరో అభిమానులను సంపాదించుకున్న వెంకటేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నరసింహ, శంకర్, గణపతి, మన్మధరావు, భాసూరు విశ్వేశ్వరరావు, మండల గణేష్ నాయుడు , పల్లంటి సాయి, మొగిలి సంతోష్, పాల్గుణ, శ్రీనివాసరావు, సూరి, రాంబాబు, ప్రవీణ్, శివకుమార్ ఇతర వెంకటేష్ అభిమానులు పాల్గొన్నారు.